## ఆలయాల్లో మౌని అమావాస్య ప్రత్యేక పూజలు



నల్లకుంట: మౌని అమావాస్యను పురస్కరించుకొని బుధవారం నల్లకుంటలోని ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. న్యూనల్లకుంటలోని సీతారామాంజనేయ సరస్వతి ఆలయం ప్రాంగణంలోని నవగ్రహాలకు తైలాభిషేకం చేశారు. సీతారామచంద్రస్వామికి ప్రత్యేక పూజలు కావించారు. అదే విధంగా అక్కడి పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామి ఆలయంలో మహాశివుడికి రుద్రాభిషేకం, విశేష పూజలు, అర్చనలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

## అన్నదానం



అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్, ఆర్యవైశ్య సంఘం నాయకులు

చిక్కడపల్లి: ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని అలవర్చుకోవాలని ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. చిక్కడపల్లి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బుధవారం వివేక్‌నగర్ ఆంజనేయ స్వామి దేవాలయం సమీపంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు చేపూరి లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి పల్లెర్ల రమేష్, కోశాధికారి నూరిరవీందర్, మాజీ అధ్యక్షుడు సింగారపు రమేష్‌గుప్తా, కేవీ ప్రసాద్‌రావు, భిక్షపతి, మామిళ్ల శ్రీనివాస్, బాలకృష్ణ, ఎస్.రాము, సురేంద్రగుప్తా తదితరులు పాల్గొన్నారు.

## దోమల నివారణకు చర్యలు తీసుకోండి



మోతీమార్కెట్‌లో పర్యటించి సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్

కాచిగూడ: దోమల నివారణకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ ఉమారాణి సూచించారు. బుధవారం కాచిగూడ, మోతిమార్కెట్‌లో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... దోమలు విజృంభిస్తుండటంతో ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని అన్నారు. ఆస్పత్రుల చుట్టు తిరుగుతూ డబ్బులు లేక అప్పుల పాలవుతున్నారని ఆమె పేర్కొన్నారు. రోజు విడిచి రోజు రోడ్లపై, ఇళ్లలో ఫాగింగ్ చేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు వాసు, భీమ్‌రాజ్, సంతోష్, రవియాదవ్, నాగు, లావణ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవు



గోల్నాక శాంతినగర్‌లో ఓ భవన శ్లాబ్‌ను కూల్చేస్తున్న టౌన్‌ప్లానింగ్ అధికారులు

అంబర్‌పేట: నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన ఓ నిర్మాణంపై జీహెచ్ఎంసీ సర్కిల్–16 టౌన్‌ప్లానింగ్ అధికారులు చర్యలు తీసుకున్నారు. గోల్నాక డివిజన్ శాంతినగర్‌లో ఓ భవన యాజమాని అనుమతులకు విరుద్ధంగా భవనాన్ని నిర్మిస్తున్నాడు. స్థానికుల ఫిర్యాదు మేరకు బుధవారం టౌన్‌ప్లానింగ్ అధికారులు నిబంధనల మేరకు భవనం వద్ద కూల్చివేతలు చేపట్టారు. జీ ప్లస్ 2 అనుమతులు పొంది నాలుగు అంతస్తులు నిర్మించడంతో చర్యలు తీసుకున్నట్లు ఏసీపీ దేవేందర్ తెలిపారు. నిబంధనలు అతిక్రమించి నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్ కిష్టయ్య, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## సులువుగా అర్థమయ్యేలా బోధన చేయాలి

ముషీరాబాద్: ఉపాధ్యాయులు విద్యార్థులకు సులువుగా అర్థమయ్యేలా బోధన చేయాలని అప్పుడే ఉత్తమ ఫలితాలు సాధిస్తారని ముషీరాబాద్ విద్యామండలి డిప్యూటీ డీఈవో శ్రావణ్ కుమార్ అన్నారు. బుధవారం ముషీరాబాద్ విద్యామండలి–2 డిప్యూటీ ఐవోఎస్ జయలక్ష్మి, శ్రావణ్‌కుమార్‌ను కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వర్, నవనీత తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

- ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే
- ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన



మాట్లాడుతున్న ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే



కార్యక్రమానికి హాజరైన ఆటోడ్రైవర్లు

బంజారాహిల్స్: ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే అన్నారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా నగర ట్రాఫిక్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం ఆటోడ్రైవర్లకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి సుమారు 300 మంది ఆటోడ్రైవర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ డీసీపీ మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటించాలన్నారు. ఇతరుల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా ఆటోడ్రైవర్లు నడుచుకోవాలన్నారు. ఆటోడ్రైవర్లు యూనిఫాం ధరించకపోవడం, స్టాప్‌లైన్ దాటడం, సిగ్నల్ జంప్, లైసెన్స్ లేకపోవడం, సరైన రిజిస్ట్రేషన్ లేకపోవడం, నిర్దిష్ట పార్కింగ్ ప్రదేశాల్లో పార్కు చేయకపోవడం, వేరే వ్యక్తులకు ఆటోలు ఇవ్వడం, ఇన్సూరెన్స్ లేకపోవడం తదితరాలు ట్రాఫిక్ ఉల్లంఘనల కిందికి వస్తాయన్నారు. వాటి వల్ల తమతో పాటు ఇతర వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. సురక్షిత డ్రైవింగ్ ద్వారానే ఎవరికీ ఎలాంటి నష్టం వాటిల్లదన్న విషయం గుర్తించుకోవాలన్నారు. ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లు తమ సమస్యలను డీసీపీ దృష్టికి తెచ్చారు. ముఖ్యంగా జిల్లాల నుంచి వచ్చే ఆటోలు, ట్యాక్సీలు, రిజిస్ట్రేషన్ కాని ఓలా, ఊబర్ ద్విచక్ర వాహనాల వల్ల తమకు కలిగే నష్టాలను వివరించారు. సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో ఆయా సమస్యలకు పరిష్కారం చూపుతామని డీసీపీ వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ హరిప్రసాద్ కట్టా, బంజారాహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సాయిప్రకాష్‌గౌడ్, జూబ్లీహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్, ఎస్సార్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సైదులు, పంజగుట్ట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బోసు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రమాదాల నియంత్రణకు చర్యలు



ఫుట్‌పాత్‌పై పోలీసుల బందోబస్తు

బంజారాహిల్స్‌లోని బసవతారకం కేన్సర్ ఆస్పత్రి వద్ద నిరాశ్రయులు, యాచకుల సంఖ్య పెరిగిపోవడంతో నిత్యం రోడ్డు ప్రమాదాల కారణంగా పలువురు మృత్యువాతపడుతున్నారు. నాలుగు రోజుల క్రితం అర్ధరాత్రి ఓ కారు ప్రమాదంలో ఫుట్‌పాత్‌పై నిద్రిస్తున్న వ్యక్తి మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ ప్రాంతంలో ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు నగరవాసులు పెద్ద ఎత్తున అన్నదానాలు చేస్తున్న నేపథ్యంలో ఆస్పత్రికి వచ్చే పేషంట్ల సహాయకుల కంటే బయటి వారే ఎక్కువ సంఖ్యలో ఉంటున్నారని పోలీసుల దర్యాప్తులో తేలింది. దీనిని కట్టడి చేసే క్రమంలో రెండు రోజులుగా సమీపంలోని షెల్టర్ నుంచి నిరాశ్రయులను జీహెచ్ఎంసీ షెల్టర్లకు తరలించారు. మరో వైపు అన్నదానాలు చేసేందుకు వచ్చే వారిని ఆస్పత్రి లోపల, అనాథాశ్రమాల్లో చేయాలని అవగాహన కల్పించి పంపిస్తున్నారు. ఈ నేపథ్యంలో బంజారాహిల్స్ పోలీసులు ఇక్కడ ప్రత్యేక బందోబస్తు సైతం ఏర్పాటు చేశారు.

## నెల రోజుల్లో బాధితులకు ఇళ్లు కేటాయించాలి

- ఆర్డీఓకు జాతీయ కమిషన్ సభ్యుడు వడ్డపల్లి రామచందర్ ఆదేశం
- ఏడాదిగా న్యాయ పోరాటం చేస్తున్న బాధితుల్లో హర్షం



జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు రామచందర్‌తో మాట్లాడుతున్న వినయ్‌కుమార్, బస్తీవాసులు

చిక్కడపల్లి: నెల రోజుల గడువులో స్వామి వివేకానందనగర్ బస్తీవాసులకు ఇళ్లు కేటాయించాలని సికింద్రాబాద్ ఆర్డీఓను మంగళవారం జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డపల్లి రామచందర్ ఆదేశించారు. న్యూఢిల్లీలో మంగళవారం జరిగిన వాదనలకు పిటిషనర్లు ఎంబీ కృష్ణ, జ్ఞానేశ్వర్, ఆనంద్ రావుతో పాటు జిల్లా కలెక్టర్ స్థానంలో ఆర్డీఓ సాయిరాం హాజరయ్యారు. ఆరు దశాబ్దాలుగా నివసిస్తున్న బస్తీవాసుల ఇళ్లను నియమ నిబంధనలు పాటించకుండా ఇళ్లు కూల్చడంపై హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనిరుధ్ దురిషెట్టి, ఆర్డీఓపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నెల రోజుల్లో బాధితులకు ఇళ్లు కేటాయించాలని ఆదేశించారు. ఏడాది కాలంగా బాధితులకు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టకపోవడం అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. బాధితులకు న్యాయం చేయకపోతే అధికారులపై న్యాయపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్ బుధవారం సాయంత్రం బస్తీవాసులను కలసి మాట్లాడారు. రాజ్యసభ ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్, గాంధీనగర్ కార్పొరేటర్ పావని సహకారంతో బస్తీవాసులకు త్వరలో న్యాయ జరుగనుందని తీపి చెప్పారు. ఈ విషయం విన్న బాధితులు ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్, కార్పొరేటర్ పావనికి కృతజ్ఞతలు తెలిపారు.

## లలితకళల సమగ్ర స్వరూపం గద్దర్

ఆచార్య కొలకలూరి ఇనాక్



గద్దర్ జయంతిలో పాల్గొన్న ఆచార్య కొలకలూరి ఇనాక్, జనార్దనామూర్తి, ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

చిక్కడపల్లి: సంగీతం.. సాహిత్యం.. నాట్యం.. నటన శిల్పం ప్రధాన లలిత కళా ప్రక్రియలు కాగా ఆ కళల సమగ్ర స్వరూపమే ప్రజా గాయకుడు గద్దర్ అని వేంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ వీసీ ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. బుధవారం త్యాగరాయ గానసభలో ప్రజా గాయకుడు గద్దర్ జయంతి వేడుకలకు ముఖ్యఅతిథిగా ఇనాక్ హాజరై మాట్లాడారు. గద్దర్ పాట రాసి నాట్యం చేస్తూ నటిస్తూ పాడే తీరు శిల్పంలా ఉంటుందన్నారు. తాను అనంతపురంలో కళాశాలలో ఉపన్యాసకుడిగా ఉన్న సమయంలో గద్దర్ రచనలు పాఠ్యాంశాలుగా బోధించనన్నారు. గానసభ అధ్యక్షుడు జనార్దనామూర్తి మాట్లాడుతూ.. గద్దర్ పాటలు మాటలు ఇప్పటికీ కళ్ల ముందు కదలాడుతూనే ఉంటాయన్నారు. ఉప్పల శ్రీనివాస్‌గుప్తా మాట్లాడుతూ.. హృదయాన్ని తాకేలా గద్దర్ పాట రాసి పడుతారన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సంఘ సేవకులు భవానీ శ్రీనివాస్, కొళ్ల సుధాకర్, ప్రభాకర్, జగన్, పాత శివకుమార్, వెంకటేష్, ప్రఫుల్ రామిరెడ్డి, తదితరులు కేంద్రమంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు.

## దేశమంతా ఒకే విధంగా పెన్షన్ ఇవ్వాలి



అధికారి రాజేష్ అగర్వాల్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న వల్లభనేని ప్రసాద్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: దేశంలోని అన్ని రాష్ట్రాలలో ఒకే విధంగా పెన్షన్ ఇవ్వాలని డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ ద డెఫ్ జాతీయ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్ అన్నారు. బుధవారం కేంద్ర వికలాంగుల సామాజిక న్యాయ విభాగం జాతీయ ప్రభుత్వ కార్యదర్శి డా. రాజేష్‌అగర్వాల్‌కు ఆయన వినతి పత్రం సమర్పించారు. దేశంలోని 20 కోట్ల దివ్యాంగులకు సంక్షేమ పథకాలు అందడం లేదని తెలిపారు. అన్ని రాష్ట్రాలలో సమానంగా రూ.10వేల పెన్షన్ ఇవ్వాలన్నారు. జాతీయ స్థాయి యూడీఐడీ కార్డులు ఇచ్చి అన్ని సంక్షేమ పథకాలను అమలు చేయాలని కోరారు. దివ్యాంగులకు న్యాయం చేకూరేలా చర్యలు తీసుకుంటామని రాజేష్ అగర్వాల్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. వినతి పత్రం సమర్పించిన వారిలో కోకన్వీనర్ వెంకటేష్‌గౌడ్, సుందీర్ మగాని తదితరులు ఉన్నారు.

## పెన్షనర్లు ఐకమత్యంతో సమస్యలను పరిష్కరించుకోవాలి



భవిష్య నిధి పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగేందర్‌ను సన్మానిస్తున్న నాయకులు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: భవిష్య నిధి పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పెన్షనర్స్ విజన్ బుక్–2ను అడిషనల్ సెంట్రల్ పీఎఫ్ కమిషనర్ తెలంగాణ ఎంఎస్‌కేవీవీ సత్యనారాయణ ఆవిష్కరించారు. అనంతరం పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ డి.నాగేందర్‌తో పాటు పలువురు ప్రముఖులను అభినందించి సత్కరించారు. అనంతరం ఎంఎస్‌కేవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ... పెన్షనర్స్ ఎప్పుడు అధైర్య పడకుండా ఐకమత్యంతో తమ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీ మెంబర్ మల్లేషం, రీజనల్ కమిషనర్–1 బర్కత్‌పుర శివకుమార్, రీజనల్ కమిషనర్–1 మాదాపూర్ సరాబ్ జగతి, పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు డి.నాగేందర్, కార్యదర్శి ఆర్.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రమణ, శ్రీదేవీ పాటలు ఆకట్టుకున్నాయి.

## ఎన్నికల్లో పోటీకి యువత ముందుకు రావాలి


టీపీఆర్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు రవికుమార్

కాచిగూడ: వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి యువత ముందుకు రావాలని తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జిలుకర రవికుమార్ పిలుపునిచ్చారు. బుధవారం కాచిగూడలో ఆయన మాట్లాడుతూ యువత రాజకీయాల్లోకి వచ్చేలా తమ పార్టీ ప్రోత్సహిస్తుందని తెలిపారు. త్వరలో జరిగే గ్రామపంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో తమ పార్టీ తరఫున అభ్యర్థులను పోటీలో దింపుతామని తెలిపారు. యువత రాజకీయాల్లోకి వస్తేనే అవినీతిలేని ప్రభుత్వం సాధ్యం అవుతుందని అన్నారు. ఈ ఏడాది డిసెంబర్‌లో జరిగే జీహెచ్ఎంసీ ఎన్నికల్లోనూ తమ పార్టీ బరిలో ఉంటుందని తెలిపారు. గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు ప్రత్యామ్నాయ శక్తిగా తమ పార్టీ ఆవిర్భవించిందని ఆయన పేర్కొన్నారు.

## ఆన్‌లైన్ చిత్రలేఖన పోటీలు 2న

కాచిగూడ: ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఫిబ్రవరి 2వ తేదీన పాఠశాల విద్యార్థులకు 'ప్రకృతి – పర్యావరణం', 'పర్యావరణ పరిరక్షణలో నేను సైతం' అనే శీర్షికలతో ఆన్‌లైన్ చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ అండ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్పీహెచ్ రంగయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు చిత్రాన్ని గీసి తమ కుటుంబ సభ్యుల సహకారంతో పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, ఫోన్ నంబర్, చిరునామా ఆన్‌లైన్‌లో పంపించాల్సి ఉంటుందన్నారు. మార్చి 3వ తేదీన ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం సందర్భంగా విజేతల పేర్లు ప్రకటిస్తామని తెలిపారు. మార్చి 22వ తేదీన ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా బహుమతులు ప్రదానం చేస్తామని పేర్కొన్నారు.

## గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



కవాడిగూడ: ఎన్టీఆర్ స్టేడియం ఫుట్‌పాత్‌పై ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని దోమలగూడ పోలీసులు బుధవారం ఉదయం స్వాధీనం చేసుకున్నారు. దోమలగూడ ఎస్సై శాంతి తెలిపిన వివరాల ప్రకారం... ఎన్టీఆర్ స్టేడియం ఫుట్‌పాత్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం పడి ఉందని స్థానికులు తమకు సమాచారం ఇచ్చారన్నారు. క్లూస్‌టీమ్‌తో సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించినట్లు తెలిపారు. మృతుడు ఇందిరాపార్కు పరిసరాల్లో భిక్షాటన చేసేవాడని తెలిపారు. అతడిని గుర్తుపడితే దోమలగూడ పీఎస్‌లో లేదా ఫోన్ నం.87126 61526కు సమాచారం ఇవ్వాలని కోరారు.

## బీసీ బిల్లు ప్రవేశపెట్టాలి

లిబర్టీ: త్వరలో ప్రారంభం కానున్న పార్లమెంటు సమావేశాల్లో బీసీ బిల్లు ప్రవేశ పెట్టాలని బీసీ దళ్ జాతీయ అధ్యక్షులు దుండ్ర కుమార స్వామి అన్నారు. ఎన్నో ఏళ్లుగా బీసీలు వివిధ రూపాల్లో పోరాటాలు చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 31 నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం బీసీ బిల్లు ప్రవేశపెట్టాలన్నారు.

## కళలకు మించిన ప్రక్రియ లేదు



'ప్రజా పాటకు నృత్య నిరాజనం' వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కేవీ రమణాచారి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ప్రపంచంలో కళలకు మించిన ప్రక్రియ లేదని పని నుంచే పాట పరిణామం చెందిందని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కేవీ రమణాచారి అన్నారు. బుధవారం ఆయన నివాసంలో ఫిబ్రవరి 16న తెలంగాణ బాలోత్సవం ఆధ్వర్యంలో 'ప్రజా పాటకు నృత్య నిరాజనం' పేరిట నిర్వహించే కార్యక్రమ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేవీ. రమణాచారి మాట్లాడుతూ... కళలను కాలానుగుణంగా మార్పులు చేర్పులు చేసుకుంటూ ప్రజల అభిరుచులకు తగ్గట్టుగా వ్యవహరించాలన్నారు. ప్రజా కళలను ప్రోత్సహించడానికి తెలంగాణ బాలోత్సవం చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బాలోత్సవం అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు, కార్యదర్శి ఎస్.సోమయ్య, ఉపాధ్యక్షుడు కె.సుజావతి, నృత్య గురువులు రమణిసిద్ధి, ఇందిరా, పరాశరం తదితరులు పాల్గొన్నారు.

## అరుణోదయ సంస్థల విలీన సభ 5న



అరుణోదయ విలీన సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కోలా స్వప్న, కొండల్ తదితరులు

ముషీరాబాద్: ఇటీవల రెండు న్యూ డెమాక్రసీ పార్టీలు విలీనమైన సందర్భంగా ఆ పార్టీల అనుబంధ సంస్కృతిక విభాగాలైన అరుణోదయ సంస్కృతిక సమాఖ్యలు ఫిబ్రవరి 5న సూర్యాపేటలో విలీన సభను నిర్వహిస్తున్నట్లు హైదరాబాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొండల్, కోలా స్వప్న తెలిపారు. బుధవారం విద్యానగర్‌లోని సీపీ భవన్‌లో అరుణోదయ విలీన సభ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఉస్మానియా యూనివర్సిటీలో కానూరి వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో అరుణోదయ ఆవిర్భవించిందని తెలిపారు. కళారూపాల పుట్టుక వాటి సామాజిక ప్రయోజనాలు ఏమిటనే దాని మీద అరుణోదయ గట్టిపట్టు సాధించిందన్నారు. సమాజంలో జరిగే దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడుతూ అరుణోదయ ముందుకు వెళ్తోందన్నారు. 5న సూర్యాపేటలో జరిగే ఈ సభకు కవులు, కళాకారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో కళాకారులు భారతి, శ్రీను, విష్ణు, గణేష్, వివేక్, శ్రీను, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి



ఆలిండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ సమావేశంలో మాట్లాడుతున్న కేసీ జేమ్స్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: సౌత్ సెంటర్ రైల్వేలో పనిచేస్తున్న కార్మికుల సమస్యల కోసం పనిచేయాలని ఆలిండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ సెక్రటరీ జనరల్ కేసీ జేమ్స్ అన్నారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అసోసియేషన్ 15 జోనల్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కేసీ జేమ్స్ మాట్లాడుతూ... సంస్థ అభివృద్ధి కోసం ప్రతి కార్మికుడు పనిచేయాలన్నారు. అందులో భాగంగా వారి సమస్యల పరిష్కారానికి తమ వంతుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. లోకో పైలెట్‌ల సంక్షేమం, రైల్వే కార్యకలాపాల భద్రతను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. లోకో రన్నింగ్ స్టాఫ్ ఖాళీలను భర్తీ చేసి కార్మికులకు సరైన విశ్రాంతి సౌకర్యం కల్పించాలన్నారు. కార్మికులకు భద్రత కల్పించి 7వ వేతన సంఘంలో వేతన స్థిరీకరణ చేపట్టాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం కోసం పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్, నాయకులు టి. హనుమయ్య, బీవీఎస్‌పీ రాజు, సూర్యకుమార్, శ్రీకుమార్, ఎస్‌డీ జిలాని పాషా తదితరులు పాల్గొన్నారు.

## బాలికతో అసభ్య ప్రవర్తన యువకుడికి మూడేళ్ల జైలు

కాచిగూడ: బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించిన ఓ యువకుడికి మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.10వేల జరిమానా విధిస్తూ నాంపల్లిలోని 12వ ఏఎస్‌జే కోర్టు న్యాయమూర్తి టి.అనిత తీర్పునిచ్చారు. ఈ సంఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో 2022 జూన్‌లో జరిగిందని ఇన్‌స్పెక్టర్ కె.చంద్రకుమార్ తెలిపారు. మలక్‌పేట ప్రాంతానికి చెందిన జహంగీర్ కుమారుడు అబేద్ ఖురేషి (30) బర్కత్‌పురకు చెందిన 13 ఏళ్ల బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. బాలిక ఫిర్యాదు మేరకు కాచిగూడ పోలీసులు అబేద్ ఖురేషిని అరెస్ట్ చేసి పోక్సో కేసు నమోదు చేశారు. బుధవారం నాంపల్లిలోని 12వ ఏఎస్‌జే కోర్టులో అబేద్ ఖురేషిని హాజరుపరచగా న్యాయమూర్తి టి.అనిత మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.10వేలు జరిమానా విధించినట్లు తెలిపారు.

## ప్రైవేటు పాఠశాలల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

కవాడిగూడ: ప్రైవేటు పాఠశాలల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. బుధవారం ట్రస్మా నూతన సంవత్సర కేలండర్‌ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ప్రైవేటు పాఠశాలల సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా ఫౌండర్ ట్రస్టీ కందాల పాపిరెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్, కోశాధికారి శ్రీకాంత్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ బసవరాజు, హైదరాబాద్ కార్యదర్శి జయరాం ప్రసాద్, నాయకులు జి. రాములు, జె. రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా గాయకుడు గద్దర్‌కు పద్మశ్రీ ఇవ్వాలి

టీయూ జేఏసీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి



గద్దర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సుల్తాన్ యాదగిరి, చంద్రుడు, జగన్, ప్రఫుల్ రాంరెడ్డి

చిక్కడపల్లి: తెలంగాణ ఉద్యమకారుల ఆధ్వర్యంలో ప్రజా గాయకుడు గద్దర్ జయంతి వేడుకలు బుధవారం త్యాగరాయ గానసభలో జరిగాయి. ఈ సందర్భంగా గద్దర్ చిత్రపటానికి టీయూ జేఏసీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... గద్దర్‌పై కేంద్రమంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు సరికావని అన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆయనను మంత్రివర్గం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ప్రజాగాయకుడు గద్దర్‌కు పద్మశ్రీ ఇవ్వాలని కేంద్రాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో నేతలు జి.చంద్రుడు, జగన్, ప్రఫుల్ రాంరెడ్డి, రాజయ్య, పి.యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## పీడీఎస్‌యూ రాష్ట్ర నూతన కార్యవర్గం ఎన్నిక

రాష్ట్ర అధ్యక్షుడిగా ఎస్వీ శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా పి.నాగరాజు





ముషీరాబాద్: ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) మహాసభలు మూడు రోజులుగా ఖమ్మంలో జరుగుతున్నాయి. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ తెలంగాణ రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా సిద్దిపేటకు చెందిన ఎస్వీ శ్రీకాంత్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా హైదరాబాద్‌కు చెందిన పి.నాగరాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రెండు పీడీఎస్‌యూల ఐక్యత సభ ముగిసిన అనంతరం నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని 45 మందితో ఎన్నుకున్నారు. బుధవారం విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో పీడీఎస్‌యూ ముఖ్యనేతలు విలేకరుల సమావేశం నిర్వహించి నూతన కార్యవర్గం వివరాలను వెల్లడించారు.

- రాష్ట్ర ఉపాధ్యక్షులుగా పి.మహేష్(హైదరాబాద్), బి.మధు(మహబూబాబాద్), పి.కిరణ్‌సూర్యపేట, డి.శ్రీకాంత్(మంచిర్యాల), జే.రాజేశ్వర్(నిజామాబాద్), సంతోష్(నాగర్‌కర్నూల్), మంద నవీన్(హైదరాబాద్), రాష్ట్ర సహాయ కార్యదర్శులుగా గౌతమ్(నిజామాబాద్), జె.తిరుపతి(ఆసిఫాబాద్), జి.మస్తాన్(ఖమ్మం), కె.శ్రీనివాస్(హైదరాబాద్), డి.ప్రణయ్(కొత్తగూడెం), జి.అజయ్(వరంగల్), ఎం.ప్రవీణ్(భువనగిరి), కోశాధికారిగా రాణాప్రతాప్(కరీంనగర్)లతో పాటు 28 మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నికైనట్లు తెలిపారు. 2013లో విడిపోయి రెండు తెలుగు రాష్ట్రాల్లో వేర్వేరు సంస్థలుగా ఉద్యమిస్తున్న పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యవర్గాలు ఐక్యత సభలో తిరిగి ఒకటయ్యాయని తెలిపారు.
- ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ.. నూతన జాతీయ విద్యావిధానం రద్దు చేయాలన్నారు. కార్పొరేట్ విద్యా సంస్థల్లో జరుగుతున్న ఆత్మహత్యలపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. డిటెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.